క్లుప్తంగా

మోడల్ స్కూల్ పరీక్ష పూర్తి

ఖాజీపేట : మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి చేపట్టిన పరీక్షలు పూర్తి అయ్యాయి. 6వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఖాజీపేట మోడల్ స్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. పాఠశాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫిజియోథెరపీతో ప్రయోజనం



ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

అట్లూరు : ఫిరిజియోథెరపీ ప్రస్తుత కాలంలో ఎంతో ప్రయోజనం అని ఎంపీడీఓ భాస్కర్ బాబు పేర్కొన్నారు. మండల కేంద్రమైన అట్లూరు స్త్రీశక్తి భవనంలో లో సోమవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో సచివాలయాల సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులకు నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ విశాఖపట్నం వారిచే ఫిజియోథెరపీతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేష్‌కుమార్ బృందం ఫిజియోథెరపీ ఏఏ సమస్యకు ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేష్, పంచాయితీ విస్తరణ అధికారి సుధాకర్‌బాబు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అన్నప్రసాద సేవ

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించారు. శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు, బెంగళూరుకు చెందిన రామయ్య, రాజశేఖర్, మురళీల సహకారంతో ఈ అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సుమారు 600 మంది అన్నప్రసాదం స్వీకరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వార్షికోత్సవం

చాపాడు: మండల పరిధి చిన్నగురువళూరులోని సీఎస్ఐ చర్చి 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ప్రత్యేక ఆరాధన వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె ఘురామిరెడ్డి, సీఎస్ఐ చర్చి రాయలసీమ డయాసిస్ సెక్రెటరీ, మైదుకూరు ఇన్‌చార్జి డివిజనల్ చైర్మన్ రెవ.సి.సాలొమోను, పులివెందుల డివిజనల్ చైర్మన్ రెవ.సి ఆనంద రావు హాజరుకానున్నారు. చర్చి ఆరాధన ప్రత్యేక ప్రార్థనలతో పాటు చర్చి సమీపంలో ఉదయం 7గంటల నుంచి న్యూ కేటగిరి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

వ్యాధిగ్రస్తురాలికి సాయం



వ్యాధిగ్రస్తురాలికి సరుకులు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సహాయం అందజేశారు. మాయలూరిశ్రీదేవి అనే మహిళ పక్షవాతంతో, అదే గ్రామానికి చెందిన సుబ్బమ్మ షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ఆచారి రామకృష్ణారెడ్డికి తెలపడంతో ఆయన వారి కుటుంబానికి నాలుగు బస్తాల బియ్యం, ఫ్యాన్లు, దుస్తులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు తమ సంస్థ ఎల్లప్పుడు చేయూతనిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వాలంటీర్లు పాల్గొన్నారు.

కలసపాడు ఎస్ఐగా తిమోతి



తిమోతి

కలసపాడు : కలసపాడు ఎస్ఐగా తిమోతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. యర్రగుంట్ల మండలం కలమల్ల ఎస్ఐగా పనిచేస్తున్న ఈయనన బదిలీల్లో భాగంగా కలసపాడు ఎస్ఐగా నియమించారు. ఈయన గతంలో పోరుమామిళ్ళ ఎస్ఐగా పనిచేశారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న ఘనమద్దిలేటి తొండూరు ఎస్ఐగా బదిలీ అయ్యారు.

పోలీసు కళాజాత

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి పోలీసు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రచందనం అక్రమ రవాణా నివారణ, సైబర్‌క్రైమ్ నివారణపై అవగాహన, రోడ్డు ప్రమాదాలపై కళాజాత బృందం వారిచే ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ళ సీఐ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కళాజాత ఎస్ఐ సుబ్రమణ్యం, కళాజాత ఇన్‌చార్జి నరసయ్య, వారి బృందం, కాశినాయన పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

‘బెల్ట్’పై కొరవడిన నిఘా

- బి.మఠంలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- రోడ్లపై చిందులేస్తున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



బ్రహ్మంగారిమఠం : పుణ్యక్షేత్రం బి.మఠంలో మద్యం ఏరులై పారుతోంది. రోడ్లపైనే గ్లాసులు గలగలలాడుతున్నాయి. బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ముఖ్యంగా బ్రహ్మంసాగర్ రోడ్డు, బద్వేల్ రోడ్డు, మల్లేపల్లె రోడ్లలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నా సంబధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మద్యం మత్తుతో కొందరు రోడ్లపై చిందులు వేస్తుంటే.. మరికొందరు కొట్టుకుంటున్నారు. తాగిన మైకంలో విచక్షణ కోల్పోతున్నారు. దీంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. బి.మఠం మండలానికి ప్రభుత్వం రెండు మద్యం షాపులు మంజూరు చేసింది. ఇందులో మల్లేపల్లె, మైదుకూరు–బద్వేల్‌రోడ్డు నందిపల్లెలో ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకున్నారు.

ఆదాయమే పరమావధిగా..

గుడి, బడి అనే తేడా లేకుండా సమీప ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. నివాస గృహాల మధ్యనే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు కనీసం అటువైపు చూడకపోవడంతో మహిళలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయమే పరమావధిగా అన్ని ప్రాంతాలలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా సంబందిత ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బెల్ట్‌షాపుల్లో అధిక ధరలు అమ్ముతున్నా అడిగేవారు లేరు. గత ప్రభుత్వంలో బెల్ట్ షాపులు లేకుండా గట్టిచర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వంతో గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



పుణ్యక్షేత్రం బి.మఠంలో 20 బెల్ట్‌షాపులు నడుపుతున్నారు. ప్రతి కూల్‌డ్రింక్, హోటలలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. అధికారులు ఏ ఒక్క బెల్ట్ షాపుపై దాడి చేసిన పాపాన పోలేదు. బి.మఠంలో మందు బాబులు వీరంగం చేయడంతో భక్తులు, మహిళలు ఇబ్బందులు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యత్తపు సుబ్బారెడ్డి, బ్రహ్మంగారిమఠం

అధికారులు విఫలం



మండలంలో ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపులు దర్శనం ఇస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో మద్యం అమ్మకాలు ప్రతి గ్రామంలో నడుస్తున్నాయి. గత ప్రభుత్వంలో మద్యం అమ్మాలంటే భయపడేవారు. ఇప్పుడు పబ్లిక్ గ్రామాల్లో మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులను కట్టడి చేయడంలో అధికారులు విఫలం చెందారు.

– లెక్కల రమణారెడ్డి, మద్దిరెడ్డిపల్లె, బి.మఠం మండలం

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంఈఓలు

బి.కోడూరు : బడి ఈడు పిల్లలు బడిలో చేర్పించాలి. 2025–26 విద్యా సంవత్సరానికి ఈ నెల 21 నుంచి 23వ తేదీలలో విద్యార్థులను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారులు డి.పుల్లయ్య, ఎం.సునీల్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురం మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న అంగన్వాడీ పాఠశాల విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరారు. అదే విధంగా 1వ తరగతిలో ఉన్న విద్యార్థులందరూ రెండవ తరగతిలోనూ, రెండవ తరగతి వారు మూడవ తరగతిలో, మూడవ తరగతి విద్యార్థులు నాల్గవ తరగతిలో, నాల్గవ తరగతి విద్యార్థులు 5వ తరగతిలో అదే పాఠశాలలో కొనసాగుతున్నారన్నారు. అయితే 5వ తరగతి పూర్తి చేసిన కొందరు విద్యార్థులు కేజీబీవీ పాఠశాల ప్రవేశం కోసం ఎదురు చూస్తుండగా మిగిలిన వారంతా ఆదిత్యారాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరుతున్నారని తెలిపారు. మోడల్ ప్రాథమిక పాఠశాలగా ఆవిర్భవించిన రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలకు రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నలుగురు ఉపాధ్యాయులు పనిచేయనున్నారని తెలిపారు. ఈ రోజు నుండి విద్యార్థులు పై తరగతిలో ప్రవేశించబోతూ ఉండగా 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులంతా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్బయ్య, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు రమణమూర్తి, మేరీఫ్లారెన్స్, కార్యాలయ సిబ్బంది రాజశేఖర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, పెంచల రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పెంచాలి

రాజుపాళెం : ఎస్సీ కార్పొరేషన్ రుణాలు తక్కువగా ఇస్తున్నారని, వీటిని మరిన్ని పెంచాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014లో ఎస్సీ కార్పొరేషన్ కింద పశువుల పెంపకం, గొర్లు, మేకలు వంటి ఉండేవని, ఇప్పుడు మంజూరైన సబ్సిడీ రుణాలు పట్టణాల్లో ఉన్న వారికి మాత్రమే ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు లేక కూలి పనిచేసుకుని జీవనం సాగించే వారికి ఈ రుణాలు ఏమాత్రం ఉపయోగపడవని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని గతంలో మాదిరే యూనిట్లు మంజూరు చేయాలని కోరారు.

పశువైద్య శిబిరం



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో భాగంగా మైదుకూరు మండలం వనిపెంట గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 220 పశువులకు చికిత్స అందించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స, విత్తుల నొక్కుట, శస్త్రచికిత్స, చూడి నిర్ధారణ పరీక్షలు, ఎద సూదలు వేశారు. సాధారణ జబ్బులకు వైద్యం చేశారు. జీవాలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ వాణి, అధ్యాపకులు రేవతి, పృథ్వీధర్‌రెడ్డి, సుమిరన్, రాజు దీపిక, అంజలి, పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్, జేవీఓ యశోద, ఏహెచ్ఏ మీరావలి, మీరా కుమారి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

మైదుకూరు : మైదుకూరులో గ్రామదేవత అంకాలమ్మ తిరునాల సందర్భంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. విజేతలుగా నిలిచిన వృషభరాజముల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. పోటీలో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, వీర నరసింహారెడ్డి, సూర్యాపేట హజాజ్ నగర్‌కు చెందిన సుంకి సురేంద్ర రెడ్డి ఎద్దులు 2,205 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. వీరికి రూ.1.50 లక్షలు, మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎద్దులు 2,200 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలవగా, వీరికి రూ.లక్ష, నంద్యాల జిల్లా గంద్రుమాన్ దిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్ రెడ్డి ఎద్దులు 2,000 అడుగులు లాగి మూడో స్థానంలో నిలవగా వీరికి రూ.75వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందించారు. అదేవిధంగా నంద్యాల జిల్లా పెసరవాయి గ్రామానికి చెందిన కలాం బాషా ఎద్దులు 1,240 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.50 వేలు గెలుపొందాయి. వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం పత్తూరు గ్రామానికి చెందిన కవ్వా బాలయ్య, దోలా వెంకటయ్య ఎద్దులు 1,000 అడుగులు లాగి 5వ స్థానంలో నిలవగా వీరికి రూ.30వేలు నగదు బహుమతి అందజేశారు.

నివాళి



జాఫర్ హుస్సేన్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మండలంలోని వనిపెంటకు చెందిన మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు, మాజీ సర్పంచ్ కె.జాఫర్ హుస్సేన్ (96) సోమవారం ఉదయం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జాఫర్ హుస్సేన్ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమ పెద్దనాన్న శెట్టిపల్లె పెద్ద నాగిరెడ్డి సమితి అధ్యక్షుడిగా, శాసనసభ్యుడిగా పోటీ చేసిన సమయంలో జాఫర్ హుస్సేన్ మద్దతుగా నిలిచారని ఆయన విజయానికి కృషి చేశారని ఈ సందర్భంగా రఘురామిరెడ్డి గుర్తు చేశారు. వనిపెంట ప్రాంతంలో రాజకీయాల్లో ముఖ్య నేతగా వ్యవహరించారని అన్నారు. జాఫర్ హుస్సేన్ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, మండల కన్వీనర్ గల్లా నర్సింహారెడ్డి, వనిపెంట సర్పంచ్ గౌస్ లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, బీసీ విభాగం నాయకుడు ఇడగొట్టు శేషు, తిప్పిరెడ్డిపల్లె సర్పంచ్ బండి నాగేంద్ర బాబు, కొత్వాల్, అశ్వాక్, శివప్రసాద్ రెడ్డి, కలాం ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని మేకప్రభాకర్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గ్రామానికి వెళ్ళి ప్రభాకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీ కొట్టాల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త జి.కృష్ణవేణి అనారోగ్యంతో మృతి చెందింది. 33 ఏళ్లుగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా కృష్ణవేణి పని చేస్తున్నారు. ఆమెకు భర్తతోపాటు కుమారుడు ఉన్నారు. సోమవారం ఆమె మృతదేహానికి ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బాల సత్సంగం సమ్మర్ క్యాంప్

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బాల సత్సంగం సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు నిర్వాహకురాలు శివదర్శనానంద సరస్వతీ మాతాజీ తెలిపారు. యోగ, ధ్యానం, క్విజ్, ఫజిల్స్, ఆర్ట్, క్రాఫ్ట్, కథలు, సత్సంగం, ప్రార్థనలు, భజనలు, భగవద్గీత శ్లోకాల పఠనం, ఆటలు, పాటలు ఉంటాయని మాతాజీ వివరించారు. 6–14 ఏళ్ల వయసు గల బాలబాలికలు రోజు ఉదయం 8.30 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహించే సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన వచ్చని తెలిపారు. వివరాలకు 7075883536 సెల్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టులను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఖాజీపేట : జన్నలిస్టులు సమాజ హితం కోసం పని చేసేవారని, అలాంటి వారిని బెదిరించడం మంచి పద్ధతి కాదని కడప జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ హరి అనే విలేకరిని ఫోన్ ద్వారా దుండగులు బెదిరిస్తున్నారని, వారిపై నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

• దుమ్ము లేస్తోంది

మైదుకూరు– పోరుమామిళ్ల ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఎద్దు అడుగు కనుమ నుంచి అమగంపల్లె వరకు పనులు జరుగుతున్నాయి. కల్వర్టు, వంతెనల వద్ద ప్రత్యేక రహదారులు ఏర్పాటు చేశారు. అయితే వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము, ధూళి లేస్తోంది. దీంతో ముందు వాహనాలు కనిపించని పరిస్థితి. మల్లేపల్లె, అమగంపల్లె, కేశాపురం, లింగాల దిన్నెపల్లె, తదితర గ్రామాల నుంచి బైక్‌లు, ఇతర వాహనాల్లో వెళ్లే వారు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గుత్తేదారులు దుమ్ము లేయకుండా నీరు వదలాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– బ్రహ్మంగారిమఠం



ఎద్దులడుగు కనుమ– లింగాలదిన్నెపల్లె రోడ్డులో దుమ్ము

ఆ కంపెనీలకు 99 పైసలకే భూములు కట్టబెట్టడం అక్రమం



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజా పక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : విశాఖ పట్నంలో టీసీఎస్, ఉర్సా కంపెనీలకు విలువైన భూములను 99 పైసలకే ప్రభుత్వం కట్టబెట్టడం అక్రమం, అన్యాయమని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి, సెక్రటరీ మునిసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ గంగయ్యకు వారు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నం రుషికొండ ప్రాంతంలో విలువైన భూములను టాటా కన్సల్టెన్సీకి 21.16 ఎకరాలను ఏడాదికి ఎకరాకు 99 పైసలకు లీజుకు ఇవ్వడం ప్రజాప్రయోజనాలకు విరుద్ధమన్నారు. చదరపు గజం రూ.30 వేలు ఉందని, మార్కెట్ ధర అంతకంటే ఎక్కువగా ఉందన్నారు. రిజిస్ట్రేషన్ విలువ తీసుకున్నా 21.16 ఎకరాలకు రూ.320 కోట్లకు మించి అవుతుందన్నారు. అలాగే ఉర్సా కంపెనీకి 60 ఎకరాల భూమిని ఎకరా 99 పైసలకు ఇవ్వడం అన్యాయమన్నారు. మరొక వైపు విశాఖలో నావికాదళానికి ఎకరా రూ.కోటి, పోస్టల్ శాఖకు 30 సెంట్ల భూమిని రూ.కోటి, సీబీఐకి ఎకరా రూ.కోటి చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రైవేట్ సంస్థలైన టీసీఎస్, ఉర్సాలకు అతి తక్కువ ధరకు ప్రభుత్వ భూములు ధారాదత్తం చేయడం, ఇది సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని తెలిపారు. వెంటనే ప్రభుత్వం ఈ లీజును రద్దు చేసి ఆ భూములను ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని కోరారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించిన తల్లికి నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఎంఈఓ

ఖాజీపేట : బడీడు ఉన్న ప్రతి ఒక్కరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ స్వర్ణలత అన్నారు. సోమవారం పత్తూరు, సుంకేశుల, ఖాజీపేటలో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవితను తల్లితండ్రులు నష్టం చేయవద్దని సూచించారు. పనిలో కాకుండా బడిలో చేర్పించి వారి ఉజ్వల భవితకు చేయూత నివ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ భూబాధితుల గోడు పట్టదా?

- నష్ట పరిహారం కోసం నిర్వాసితులు ఎదురుచూపు
- రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

బ్రహ్మంగారిమఠం : మండలంలో మైదుకూరు–పోరుమామిళ్ళ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా ఒక రోడ్డు నిర్మాణం జరుగుతుంది. అలాగే గ్రీన్‌ఫీల్డ్ హైవే మరొక రోడ్డు నిర్మాణం కొనసాగుతుంది. ఈ రెండు రోడ్లకు భూసేకరణలో భాగంగా వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు కోల్పోతున్న బాధితులకు రెవెన్యూ అధికారులు సరిగా స్పందించకపోవడంతో.. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రతి రోజు వందల సంఖ్యలో నిర్వాసితులు వస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మల్లేపల్లె, ముడుమాల గ్రామ పంచాయతీలలోని లింగాలదిన్నెపల్లె, మల్లేపల్లె, ఎద్దులాయపల్లె, ముడుమాల, కేశాపురం, వెంకటాపురం గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు నష్టపరిహారం కోసం తిరుగుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా ఏదొక పత్రం లేదని రెవెన్యూ అధికారులు మెలిక పెడుతున్నారు అంటే ఏమిటో తమకు అర్థం కావడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ డీ పట్టా పొందిన వారు అనుభవం, ఆన్‌లైన్‌లో ఉన్నా వారికి నష్టపరిహారం రాయడంలో రెవెన్యూ అధికారులు ఆలస్యం చేస్తున్నారు. అలాగే పూర్వపు పట్టాదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. నష్టపరిహారం కోసం తహసీల్దార్ దామోదర్‌రెడ్డి దగ్గరకు వెళ్తే మాటలు చెప్పి పంపుతున్నారు తప్పా పనులు చేయడం లేదు. త్వరగా పరిష్కారం చూపాలని ఎవరైనా అడిగితే ఆర్డీఓ, జేసీ, కలెక్టర్ దగ్గరకు వెళ్లండి అంటున్నారు. అక్కడికి వెళ్తే తహసీల్దార్ దగ్గర నుంచి రాయించుకొని రావాలని పై అధికారులు అంటున్నారు. బి.మఠం రెవెన్యూలో వీఆర్‌ఓలు సరిగా పనులు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా పైఅధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

పేదల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని పేదల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయా కాలనీవాసులతో నిరసన చేపట్టి అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్యకాలనీ, ఐలమ్మకాలనీ, జ్యోతిబసుకాలనీలలో గత 20 సంవత్సరాలుగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు బ్రహ్మంసాగర్ పైప్ లైను ఏర్పాటు చేయడంతో పాటు రూ.200 లకే కొళాయి కనెక్షన్ ఇవ్వాలని కోరారు. అలాగే పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, అన్ని శ్మశానవాటికలను అభివృద్ధి చేపట్టాలని కోరారు. ఆయా కాలనీల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, మస్తాన్‌షరీఫ్, అనంతమ్మ, మోక్షమ్మ, రాయప్ప, శాఖా కార్యదర్శులు మస్తాన్‌బీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం



రోడ్డు దారుణ పరిస్థితి చూపుతున్న సీపీఐ బృందం

పోరుమామిళ్ల : నాలుగు లేన్ల రోడ్డు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడు, ఎక్కడ ప్రమాదం జరుగుతుందో, ఎవరి ప్రాణం గాల్లో కలసి పోతుందో తెలియని పరిస్థితి. ఆరు నెలలుగా మైదుకూరు – పోరుమామిళ్ల మధ్య పనులు జరుగుతున్నాయి. ఇపుడు నరసింగుపల్లె – అమగంపల్లె మధ్య పరిస్థితి ప్రమాదకరంగా తయారయింది. కాంట్రాక్టర్లు లెక్కలేని అహంకారంతో పనులు పద్ధతి లేకుండా చేస్తున్నారు. ఒక వైపు రోడ్డు పూర్తి చేశాక, రెండవ వైపు పని మొదలు పెడితే పెద్ద ఇబ్బంది ఉండదు. అలా కాకుండా నాలుగు లైన్ల విస్తరణ ఒకే సారి పనులు చేస్తుండటంతో విపరీతంగా దుమ్ము లేచి, ముందు వైపు ఏమీ కనిపించడం లేదు.ఆటో, మోటార్‌బైక్‌లపై వెళ్లేవారు ఆందోళనతో ప్రాణాలు అరచేత పట్టుకొని వెళుతున్నారు. కొంతమంది భయపడి ఈ దారిలో వెళ్లడం మాని వేశారు. కాంట్రాక్టర్ల తీరుపై వస్తున్న విమర్శల నేపథ్యంలో సోమవారం సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్‌ల అధ్వర్యంలో సీపీఐ బృందం రోడ్డు వెంట తిరిగి పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నిత్యం రోడ్డుపై వేలాది వాహనాలు తిరుగుతున్నాయని, బస్సు డ్రైవర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు ఎక్కడ నిద్ర పోతున్నారో తెలియడం లేదని, తక్షణం స్పందించి కాంట్రాక్టర్లతో మాట్లాడి, పద్దతి సరిదిద్దాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

అట్లూరు : బద్వేలు మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో సోమవారం ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ మాట్లాడుతూ చింతలచెరువు, పుట్టాయపల్లె, కొంగలవీడు రాజుపాలెం, తిప్పనపల్లెలలో పది యూనిట్లు ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం జరుగుతోందని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని తెలిపారు. పీఎండీస్ నవధాన్యాలు సాగుతో 365 రోజులు పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఘన, ద్రవ జవామృతం తయారీ, వినియోగం, వివిధ రకాల కషాయాలు, ద్రావణాల గురించి వివరించారు. అలాగే జాతీయ నూనె గింజలు అభివృద్ధి పథకం, జాతీయ ఆహార భద్రత మిషన్ కింద చిరుధాన్యాలు, పప్పుదినుసులు సాగు, విలువజోడింపు, పంటల సరళిపై అవగాహన కల్పించారు. సదస్సులో మండల వ్యవసాయాధికారి కె.చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధి హామీ క్లస్టర్ ఏపీఓ మల్లేశ్వరరెడ్డి, ఏపీఎం పి.శైలజ, వెలుగు సీసీలు, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

చాపాడు : పాఠశాల అభివృద్ధి గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్ బాషా పేర్కొన్నారు. మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో హెచ్ఎం మాట్లాడుతూ.. మొర్రాయిపల్లె పాఠశాలలో అన్ని రకాలైన వసతులు, సౌకర్యాలు ఉన్నాయని దీని కారణంగా ఈ పాఠశాల మోడల్ స్కూల్‌గా ఎంపికైందన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉంటారని దీనిని గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఈ పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసి గణిత బోధన సామాగ్రి ప్రాజెక్టులో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన నాగలక్ష్మిని ఉపాధ్యాయ సిబ్బంది, సర్పంచ్ వై.శ్రీనివాసులరెడ్డి సన్మానించారు.